

● జిందాల్ అల్యూమినియం ప్రాజెక్టు పేరిట గతంలో మా భూములను తీసుకున్నారు. పరిశ్రమ వస్తే పిల్లలకు ఉద్యోగాలు, పరోక్షంగా మాకు పని దొరుకుతుందని అందరూ చెప్పడంతో భూములను ఇచ్చాం. ఈ సమయంలో మాకు జిందాల్ యాజమాన్యం అనేక హామీలను ఇచ్చింది. కానీ, ఇంత వరకు వాటిని నెరవేర్చలేదు. పరిశ్రమను కట్టకుండా భూములను ఖాళీగా ఉంచేశారు. ఒకపక్క వ్యవసాయం లేక, మరొపక్క పరిశ్రమను నిర్మించక జీవనోపాధిని కోల్పోయాం. నష్టపరిహారం చెల్లింపులోనూ అన్యాయం చేశారు. ప్రస్తుతం స్థాపిస్తామంటున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఎటువంటి పరిశ్రమలు పెడతారో చెప్పడం లేదు. వాటిల్లో మాకు, మాపిల్లలకు ఇస్తామన్న ఉద్యోగాలేంటో తెలియదు. అందుకే మా భూములు మాకు తిరిగి ఇచ్చేయాలి.

- జిందాల్ భూ నిర్వాసితుల ఆవేదన ఇది.

ఆశలు.. ఆవేదన

- రోజుకో మలుపు తిరుగుతున్న జిందాల్ భూవ్యవహారం
- ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలంటున్న నిరుద్యోగ యువత
- దీనివల్ల ఉద్యోగ అవకాశాలు వస్తాయంటున్న వైనం
- ఇన్నాళ్లూ ఏం చేశారు.. మా భూములను తిరిగి ఇచ్చేయాల్సిందే
- డిమాండ్ చేస్తున్న నిర్వాసితులు
- ఉద్రిక్తతలకు దారి తీస్తున్న పరిస్థితులు ● ఆంక్షలు విధించిన పోలీసులు




● ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పార్కుల ఏర్పాటుపైనే ఆశలు పెట్టుకున్నాం. దీనివల్ల గ్రామీణ యువతకు స్థానికంగా ఉపాధి దొరుకుతుంది. వలసలు వెళ్లే అవసరం ఉండదు. వేల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. పరిశ్రమల స్థాపనకు ఇక్కడ భూములను ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు జిందాల్ యాజమాన్యం ముందుకు వస్తుంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుంది. ఇలాంటి సమయంలో భూములను తిరిగి ఇచ్చేయాలని నిర్వాసితులు ఆందోళన చేయడం ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడమే. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పందించి పరిశ్రమలను నెలకొల్పేలా ప్రభుత్వం, జిందాల్ యాజమాన్యంపై ఒత్తిడి తేవాలి. భూ నిర్వాసితులకు బాసటగా ఉంటాం. వారి సమస్యలను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతాం. భూసమస్యలు, పరిశ్రమల కోసం ఉద్యమిస్తాం.

- రెండు రోజుల కిందట జిందాల్ భూముల వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో నిరుద్యోగ యువత అన్న మాటలివీ.

శృంగవరపుకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇలా ఎవరి ఆశలు, ఆవేదన వారివే. పరిశ్రమలు వస్తే స్థానికంగా ఉద్యోగాలు దొరుకుతాయని నిరుద్యోగ యువత భావిస్తుంటే.. పరిశ్రమలకు గతంలో తాము ఇచ్చిన భూములతో తమకు ఒరిగిందేమీ లేదని, ఆ భూములను తిరిగి తమకు ఇచ్చేస్తే వ్యవసాయం చేసుకుంటామని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం ఉద్రిక్తతలకు దారితీస్తుండడంతో జిందాల్ భూముల్లోకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు కాపలాకాయాల్సి వస్తుంది. అనుమతులు లేకుండా ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలు చేయొద్దని హెచ్చరిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అల్యూమినియం శుద్ధి కర్మాగారం (రీఫైనరీ, విద్యుత్ పవర్ ప్లాంట్) నిర్మాణానికి భూమి కావాలంటూ జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ (జిందాల్ యాజమాన్యం) ప్రతిపాదన పెట్టింది. ఈ పరిశ్రమకు ముడిసరుకుగా బాక్సైట్ నిక్షేపాలు అవసరమని, గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఈ ముడిసరుకు తవ్వకం అంత సులభం కాదని అప్పటి ప్రభుత్వానికి తెలుసు. అయినప్పటికీ అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జిందాల్ భూసేకరణకు తెరలేపారు. దీనికోసం శృంగవరపుకోట మండలంలోని కిల్తంపాలెం, ముషిడిపల్లి, పెదఖండేపల్లి, బొడ్డవర తదితర గ్రామాల్లో భూ సేకరణకు పూనుకున్నారు. అప్పట్లో మామిడి, జీడి, కొబ్బరి వంటి తోటలతో ఈ ప్రాంతం కోనసీమను తలపించేది. ఇక్కడ ఉన్న రైతుల్లో అత్యధిక శాతం గిరిజనులు కావడంతో భూములపైనే ఆధారపడి (మిగతా 8వ పేజీలో..)



శృంగవరపుకోట మండల పరిధిలో జిందాల్‌కు సేకరించిన భూములు

పైసలిస్తేనే ఫైల్ కదిలేది

- అవినీతికి పాల్పడుతున్న కొంతమంది అధికారులు
- ప్రతి పనికీ లంచం డిమాండ్
- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని తీరు



కొన్ని ఉదాహరణలు..

● ఈ నెల 15న రూ.15 వేలు లంచం తీసుకుంటూ నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్ ఏసీబీకి పట్టుబడ్డారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి ప్లాన్ కోసం ఆయన రూ.20 వేలు డిమాండ్ చేశారు. రూ.15 వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమ్య సారథ్యంలో సిబ్బంది చేసిన దాడుల్లో ఆయన అడ్డంగా పట్టుబడ్డారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న తారక్‌నాథ్ ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కపెడుతున్నారు.

● గత నెల 23న ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలపై సాలూరు మున్సిపల్ కమిషనర్ జయరాం ఏసీబీకి పట్టుబడ్డారు. ఇదే మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన శంకరరావు 2023 ఆగస్టులో ఓ వ్యక్తి నుంచి రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

● తెర్లాం మండల గృహనిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు సైతం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఇళ్ల బిల్లులు చెల్లించేందుకు ఆయన లంచం డిమాండ్ చేశారు. లబ్ధిదారులతో కుదిరిన ఒప్పందం మేరకు చివరివిడత రూ.20వేలు ఇస్తుండగా అవినీతి (మిగతా 8వ పేజీలో..)

రాజాం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొంతమంది ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. ప్రతి పనికీ లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారు అడిగినంత ఇవ్వకపోతే ఆ ఫైల్ ముందుకు కదలదనే అపవాదు ఉంది. జలగల్ల మాదిరిగా ప్రజలను పట్టి పీలుస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ధ్రువపత్రాల జారీకి, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్, పింఛన్లు , ఇళ్ల బిల్లుల మంజూరు కోసం అధికారులకు చేయితడపాల్సి వస్తుంది. లంచం ఇవ్వకపోతే ఆ పని చేయడం లేదు. రెవెన్యూ, హౌసింగ్, మున్సిపల్, వ్యవసాయ, విద్యుత్, ట్రెజరీ ఇలా అన్నిశాఖల్లో లంచావతారులు ఉన్నారు. కొంతమంది తమ అవసరాల కోసం అధికారులకు లంచాలిస్తూ పనులు చేయించుకుంటుంటే.. కొద్దిమంది మాత్రం అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించి అవినీతి అధికారులు, ఉద్యోగుల ఆట కట్టిస్తున్నారు.

ప్లాస్టిక్ రహితంగా విజయనగరం

- ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి
- తడి, పొడిచెత్తపై అవగాహన పెరగాలి ● హోంశాఖ మంత్రి అనిత



మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి అనిత, చిత్రంలో ఎమ్మెల్యే అదితి

విజయనగరం/ విజయనగరం రూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి): కళలు, క్రీడలు, విద్య, సాహిత్యానికి నిలయంగా ఉన్న విజయనగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గంట స్తంభం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ సంగీత కళాశాల రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడారు. 'ప్లాస్టిక్‌ను వినియోగించి రోగాలను మనమే కొని తెచ్చుకుంటున్నాం. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి. దీనిపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలి. దశలవారీగా ప్లాస్టిక్‌ని నిర్మూలించే విధంగా కృషి చేయాలి.' అని సూచించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. విజయనగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఇప్పటికే కృషి చేస్తున్నారని తెలిపారు. దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని విక్రయించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారని (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

'ఉపాధి' లక్ష్యాలను పూర్తి చేయాలి

- కూలీలకు కనీస వేతనం అందించాలి ● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో డ్వామా, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు కేటాయించిన కోటి 33 లక్షల పని దినాల లక్ష్యాన్ని ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కూలీలకు కనీస రోజువారి వేతనం రూ.307 అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ పనులకు సంబంధించి 75శాతానికి పైగా ఉన్నవాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ (మిగతా 8వ పేజీలో..)

టెక్నాలజీతో గంజాయికి అడ్డుకట్ట

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

గజపతినగరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ, డ్రోన్ల సహాయంతో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. శనివారం ఆయన గజపతినగరం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'విశాఖపట్నం రేంజ్ పరిధిలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి ఏడాదిలో 2వేల మందిపై కేసులు నమోదు చేసి (మిగతా 8వ పేజీలో..)

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్ ● పలు కేసుల్లో నిందితుడైన నవీన్‌పై పీడీ యాక్టు



విజయనగరం క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాజాం మండలం గురవాం గ్రామానికి చెందిన కుప్పిలి నవీన్ అనే వ్యక్తి చెడు వ్యవసనాలకు బానిసై, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తూ, గొడవలు పడుతున్నాడు. గత ఐదేళ్లల్లో ఆయనపై రాజాం పోలీసు స్టేషన్‌లో నాలుగు, సంతకవిటి పోలీసు స్టేషన్‌లో 8 కేసులు నమోదయ్యాయి. మొత్తం 12 కేసుల్లో నవీన్ నిందితుడిగా ఉన్నాడు. ముందస్తు చర్యల్లో భాగంగా నవీన్‌పై పీడీ యాక్టుని అమలు చేయాలని రాజాం పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. ఇక్కడి నుంచి కలెక్టర్ అంబేడ్కర్‌కు ప్రతిపాదనలు పంపించాం. కలెక్టర్ వాటిని పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే విధంగా నవీన్ మారుతున్నాడని భావించి పీడీయాక్టును ప్రయోగించాం. అయన్ను అరెస్టు చేసి విశాఖ సెంట్రల్ జైలుకు తరలించాం.'అని ఎస్పీ తెలిపారు.

పెట్రోల్ బంకులపై పర్యవేక్షణేదీ?

● రాజాంలోని ఓ పెట్రోల్ బంక్‌లో శివ అనే యువకుడు తన బైక్‌కు పెట్రోల్ కొట్టించాడు. గతంలో లీటరు పెట్రోల్ 50 కిలోమీటర్లు మైలేజ్ ఇవ్వగా..ఈ సారి అది 30 కిలోమీటర్ల ఇచ్చింది. దీంతో ఆందోళనతో మెకానిక్‌ను ఆశ్రయించాడు. పెట్రోల్ కల్తీ మూలంగానే మైలేజీ తగ్గిందని మెకానిక్ చెప్పాడు. దీంతో షాక్ తినడం శివ వంతైంది.

● శ్రీనివాసరావు అనే యువకుడు పార్వతీపురం గ్రామీణ ప్రాంతానికి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. సుదూర ప్రాంత ప్రయాణం కావడంతో రాజాంలోని ఓ పెట్రోల్ బంక్‌లో రూ.300 లీటర్ల పెట్రోల్ కొట్టించాడు. కానీ, 100 కిలోమీటర్ల ప్రయాణంలోనే బైక్ ఆగిపోయింది. దీంతో పెట్రోల్ వేయడంలో ట్యాంపరింగ్ జరిగిందని తెలుసుకొని బంక్ సిబ్బందిని అడిగితే వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

రాజాం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో గోల్‌మాల్ జరుగుతోంది. కొన్ని బంకుల్లో కల్తీ చేస్తుండగా.. మరికొన్నిచోట్ల మిషన్ ట్యాంపరింగ్ చేసి విక్రయాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కనీస నిబంధనలు పాటించడం లేదు. బంకుల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 180 వరకూ పెట్రోల్ బంకులు ఉన్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లలో ట్యాంపరింగ్ చేస్తున్నారు. లీటరు పెట్రోల్‌కు 100, 200 మిల్లీ లీటర్ల వరకూ పక్కదారి పట్టిస్తున్నారు. బంకుల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. ఏరోజుకారోజు బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాలి. ఇది ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. నిత్యం పెట్రోల్, డీజిల్ పెరుగుదలతో వినియోగదారులు కూడా పట్టించుకోవడం లేదు. వాస్తవానికి పెట్రోల్ నాణ్యత తెలుసుకునేందుకు బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంటుంది.

ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరి అయిపోతే అది నాణ్యమైన పెట్రోల్. మరకలుగా మిగిలిపోతే అది కల్తీ జరిగినట్టు నిర్ధారించవచ్చు. ఈ విషయం చాలామంది వినియోగదారులకు తెలియదు. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.110కు చేరింది. డీజీల్ రూ.100కు పైగా ఉంది. బంకులు అందుబాటులో లేనిచోట లూజు విక్రయాల పేరిట భారీ దోపిడీ జరుగుతోంది. లీటరు పెట్రోల్‌ను రూ.120కుపైగా విక్రయిస్తున్నారు. పైగా కల్తీ చేసి అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వాహనాలు పాడవుతున్నాయి.



మూడేళ్లలో 123 కేసులు..

గత మూడేళ్లలో అక్రమాలకు పాల్పడిన 123 మంది పెట్రోల్ బంకు నిర్వాహకులపై అధికారులు కేసులు నమోదు చేశారు. గత మూడు నెలల్లో 45 చోట్ల తనిఖీలు చేయగా.. 10 చోట్ల అక్రమాలు జరిగినట్టు (మిగతా 8వ పేజీలో..)

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

శృంగవరపుకోట రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొట్టాం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు రూ.50వేలు విలువచేసే క్రీడా దుస్తులు వితరణ చేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం వీటిని అందజేశారు. ఉపాధ్యాయులు పి.భాస్కరరావు, బంగారునాయుడు, సింహాచలంనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపండి

● మాజీ మంత్రి బొత్స

గరివిడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పాలనలో లోపాలను ఎత్తిచూపాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం గరివిడిలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆయన చీపురుపల్లి మండలానికి చెందిన వైసీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బెల్లాన చంద్రశేఖర్, బొత్స సందీప్‌బాబు పాల్గొన్నారు.

క్వారీ కార్మికుల సమ్మె

దత్తిరాజేరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): సరేవలస గ్రామ పరిధిలో ఉన్న క్వారీలో పనిచేస్తున్న కార్మికులు శనివారం సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య, భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ కల్పించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. యాజమాన్యం ఫిర్యాదు మేరకు పెదమానాపురం ఎస్‌ఐ ఆర్.జయంతి అక్కడకు చేరుకుని, కార్మికులతో మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మెను విరమించారు.

ఆయిల్‌పామ్ తోటలపై దృష్టి సారించాలి

భోగాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): అధిక రాబడిగల ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. సవరవల్లి గ్రామంలో కూర్మారావు అనే రైతు వేసిన ఆయిల్ పామ్ తోటలను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి సంబంధించి ఎకరాకి రూ.27వేలు విలువ చేసే మొక్కలు, ఇతరత్రా ఇన్‌పుట్ రాయితీలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ రాయితీ ప్రకారం ఎకరాకి ఖర్చులు పోను రైతులు రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఉమాభరణి, వీహెచ్ఏ శాంతి, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

విద్యతో పేదరికాన్ని జయించవచ్చు

కొత్తవలస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత ఉంటే పేదరికాన్ని జయించవచ్చని కొత్తవలస కోర్టు న్యాయాధికారి డా.సముద్రాల విజయ్ చందర్ అన్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా వీఏవోలకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. వెలుగు ఏపీఎం వెంకటరమణ, ఎస్‌ఐ హేమంత్‌కుమార్, న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, న్యాయవాదులు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

డ్రోన్ల పంపిణీ

గంట్యాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్లు పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని నరవ గ్రామంలో శనివారం ప్రారంభించారు. టీడీపీ నాయకుడు కొండపల్లి కొండలరావు చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కొండపల్లి భాస్కర్‌నాయుడు, అల్లు విజయకుమార్, రంధి రామునాయుడు, జనసేన నాయకులు సారాధి అప్పలరాజు, వ్యవసాయ శాఖ ఏవో శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత నృత్య కళాశాల అభివృద్ధికి కృషి

విజయనగరం బాబామెట్ట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహారాజా సంగీత నృత్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మి అన్నారు. శనివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తాను ఇదే కళాశాలలో 31 ఏళ్లు అధ్యాపకురాలిగా బాధ్యతలు నిర్వహించానన్నారు. పదోన్నతిపై రాజమహేంద్రవరం సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వెళ్లి, తిరిగి తాను అధ్యాపకురాలిగా పనిచేసిన కళాశాలకు ప్రిన్సిపాల్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ

లక్కవరపుకోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గత మూడు రోజులుగా నిరసన చేస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం సమ్మె విరమించారు. ఈ నిరసనపై ఎంపీడీవో ఎస్.అప్పారావు స్పందించి.. ప్రభుత్వం జీతాలు వేసిన వెంటనే ఇస్తామని, అంతవరకు రెండు నెలల జీతం అందిస్తామని తెలపడంతో వీరు సమ్మెను విరమించారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోండి

విజయనగరం దాసన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డక్కిన వీధిలో ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కన్వీనరు బొబ్బాది సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి అనుమతులు లేకుండా పాఠశాల నడపడడం వల్ల విద్యార్థులు రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలి

● మంత్రి శ్రీనివాస్



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ప్లాస్టిక్ ఫ్రీ అమలు చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఉత్పత్తి అవుతున్న వర్మీ కంపోస్టును వ్యవసాయ, ఉద్యాన పంటలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెత్తసంపద కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో మల్లికార్జునరావు, తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎంపీడీవో కల్యాణి, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ కోడి సతీష్, సర్పంచ్ నరవ కొండమ్మ పాల్గొన్నారు.

దశలవారీగా ప్లాస్టిక్ నిర్మూలన

● పారిశుధ్య నిర్వహణలో క్లాప్ మిత్రల పాత్ర కీలకం ● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

చీపురుపల్లి, జులై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దశల వారీగా ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అన్నివర్గాల సహకారంతో లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. పారిశుధ్యాన్ని మెరుగు పరచడంతో బాటు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంకోసం ప్రతి నెలా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం చీపురుపల్లిలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. మూడురోడ్లజంక్షన్‌లో ఏర్పాటుచేసిన మానవహారంలో కలెక్టర్ పర్యావరణంపై ప్రతిజ్ఞ చేయించారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒక్కో అంశానికి ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా ఈనెల కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణలో క్లాప్ మిత్రల పాత్రకీలకమన్నారు. అనంతరం క్లాప్‌మిత్రలకు సనించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీఎల్ డీవో హేమసుందర్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, ఎంపీడీవో ఐ. సురేష్, తహశీల్దార్ డి.ధర్మరాజు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు



ఏడాది పాలనపై వివరిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె విజయనగరంలోని 29, 30, 31 డివిజన్లలోనూ, మండల పరిధిలోని బియ్యాలపేట గ్రామంలో ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర, మండల నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే సుపరిపాలన



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బంగార్రాజు

నెల్లిమర్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని చినబూరాడపేట, పారసాం గ్రామాల్లో టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్టీ నాయకులు బెల్లాన రాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ఆనందంగా ఉన్నాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

జామి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలన కంటే ప్రస్తుత చంద్రబాబు పాలనలో చాలా సంతోషంగా ఉన్నామని లక్ష్మీపురం గ్రామ మహిళలు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం లక్ష్మీపురంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆమె కూటమి పాలనపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరక్టర్ శ్రీలక్ష్మి, పార్టీ మండల కార్యదర్శి రమణ, ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని పండ్లు, కూరగాయాలతో అలంకరించిన దృశ్యం

శాకంబరిగా ముత్యాలమ్మతల్లి

జామి జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ గ్రామంలో గల ముత్యాలమ్మతల్లి శనివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి, ఈ ఏడాది పంటలు బాగా పండాలని పూజలు చేశారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

గజపతినగరం జూలై 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పాలకులు, అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు అధ్యక్షతన జరిగిన మొదటి సాధారణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ సభ్యులు నియోజకవర్గ స్థాయిలో రైతుల కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఐదు కొత్త ప్రతిపాదనలు వచ్చాయని, వాటి సాధ్యాసాధ్యాలు పరిశీలించి అతికొద్ది సమయంలో వాటిని అమల్లోకి తీసుకువచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ సెక్రటరీ చంద్రమౌళి, సూపర్‌వైజర్ వై.మురళి, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలి

నెల్లిమర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు డిమాండ్ చేశారు. ఆయన శనివారం నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ మొదలుకావడంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు, ఇతర వ్యవసాయ అవసరాలకు నిధులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతు బజారును కొనసాగించాలి

విజయనగరం దాసన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత మహారాజు ఆసుపత్రి వద్ద ఉన్న రైతుబజారును కొనసాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంతకాల ఉద్యమం నిర్వహించారు. ముందుగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ సంతకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు అన్యాయం చేస్తే సంఘంతో కలిసి పోరాడుతామన్నారు. 1999 నుంచి రైతు బజారు ఇక్కడే ఉందని, 26 ఏళ్లుగా 50 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.సురేష్, టీవీ రమణ, లక్ష్మి, రమణమ్మ, రమణ, జగన్మోహన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జామి తహసీల్దార్‌పై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

జామి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కృష్ణంరాజుపై జామి మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరుణ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గొడికొమ్ము సర్పంచ్ భవానీ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో కొందరు రైతులు షెడ్లు వేసుకుని పశువులను ఉంచుతున్నారని, అయితే కొద్దిరోజుల కిందట ఎవరో ఫిర్యాదు ఇచ్చారని తహసీల్దార్ వాటిని కూల్చివేయడం తగదన్నారు. దీనిపై పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే మండలంలోని ఆక్రమణలను తొలగించాలన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పదేపదే ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇచ్చి కూల్చామని చెప్పారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సరయు, ఎంపీడీవో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా

గరివిడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. గరివిడి పట్టణంలో నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రం, సీసీ రోడ్లను ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, టీడీపీ మండల నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, రెడ్డి గోవింద్, సత్యం మాస్టార్, వర్మరాజు, వటికల్ల సత్యం, సత్తిరాజు పాల్గొన్నారు.

చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలి

రాజాం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత వ్యవసాయ కార్యాలయం ఖాళీ స్థలంలో వేసిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చీకటి రఘునాథ్.. మున్సిపాలిటీ కమిషనర్ జె.రామప్పలనాయుడును కోరారు. శనివారం ఆయన ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. డంపింగ్ యార్డులా చెత్తవేసి ఉండటంతో కమిషనర్‌కు ఫోన్ చేశారు. ఖాళీ స్థలంలో చెత్తను వేయడ వల్ల కోర్టుకు ఆనుకుని స్థలం ఉండటంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టుకు వచ్చిన ప్రజల ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వెంటనే ఈ చెత్తను తొలగింపజేయాలని ఆయన కోరారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్.. సోమవారం పారిశుధ్య సిబ్బందిని పంపించి తొలగించేలా చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.

హరికథా పాఠ్యాంశానికి ప్రతిపాదనలు పంపండి

విజయనగరం దాసన్నపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే గజపతులతో ప్రప్రథమంగా నెలకొల్పబడిన విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో హరికథా పాఠ్యాంశానికి ప్రతిపాదనలు పంపించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 1919 నుంచి 1936 వరకూ 17 ఏళ్ల ప్రథమ అధ్యక్షుడిగా పనిచేసినా, సంగీత నృత్య కళాశాలలో హరికథా పాఠ్యాంశం లేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, కర్నూలు, గుంటూరు ఆరు ప్రాంతాల్లో సంగీత కళాశాలలు ఉన్నాయని, ఒక్కచోట పాఠ్యాంశం లేక రాబోయే తరానికి హరికథ కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. ఏర్పాటయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాల కృష్ణ, కంది సీతారాం, బూర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను పరిశీలించిన ప్రత్యేక బృందం



పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

విజయనగరం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపడుతున్న పనులను కేంద్రం నుంచి వచ్చిన ప్రత్యేక బృందం శనివారం పరిశీలించింది. విజయనగరం మండలంలోని గుండాలపేట, చిల్లపేట, పినవేమలి గ్రామాల్లో పర్యటించి అక్కడ చేపట్టిన ఉపాధి హామీ పనులు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణాలను ఆ బృంద సభ్యులు పరిశీలించారు. ఆయా నిధులు వ్యయం క్షేత్రస్థాయిలో పనుల ప్రగతి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల నేరుగా లబ్ధిదారులతో మాట్లాడి కేంద్ర ప్రయోజిత పథకాల అమలు తీరు ఎలా ఉందో ఆరా తీశారు. కొన్ని చోట్ల పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడాన్ని గమనించి.. తక్షణం ఆయా పంచాయతీలకు భవనాలు నిర్మించుకోవాలని మండల స్థాయి ప్రజాప్రతినిధులకు సూచించారు. రికార్డుల నిర్వహణలో కొన్ని పంచాయతీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వాటి పరిరక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఈ బృందంలో కేంద్ర బృందం ప్రతినిధులు సునీల్ బంటా, నాథూ సింగ్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ సావిత్రి, ఎంపీడీవో గంటా వెంకటరావు, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఆయా పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువులు కొందరికేనా?

వంగర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న ఎరువులు కొందరికేనా.. అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బాగెమ్మపేట రైతు సేవా కేంద్రానికి శుక్రవారం రాత్రి 420 బస్తాలతో యూరియా లారీ వచ్చింది. ఆ యూరియాను గ్రామ ఏఈవో అప్పలనాయుడు సచివాలయ సమీపాన గల కోళ్లఫారంలో నిల్వ చేశారు. దీంతో రైతులు శనివారం ఉదయం పెద్దఎత్తున సచివాలయానికి చేరుకున్నారు. లైన్‌లో నిలబడ్డారు. ఒకరికి ఒకటి చొప్పున పదిమంది రైతులకు యూరియా ఇచ్చి, అయిపోయిందని అధికారులు చేతులెత్తేశారు. దీంతో రైతులు ఆగ్రహించారు. అధికారులకు శాపనార్థాలు పెట్టారు.

మా సిబ్బంది తప్పిదమే..

బాగెమ్మపేటలో యూరియా పంపిణీలో జరిగిన నిర్లక్ష్యం మా సిబ్బంది తప్పిదమే. యూరియా వచ్చినట్లు తమకు తెలియపరచకుండా వేరే చోట నిల్వ ఉంచారు. దీంతో కొందరు బలవంతంగా డబ్బులు ఇచ్చి యూరియాను పట్టుకుపోయారు. పై అధికారులకు జరిగిన విషయాన్ని తెలియజేస్తా. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తా. - కన్నబాబు, ఏవో, వంగర

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలి

● సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ ● జిందాల్ నిర్వాసితులతో కలిసి నిరసన



బొడ్డవరలో నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్ జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యం 2008లో నిర్వహించిన ప్రజాప్రాయసేకరణలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ డిమాండ్ చేశారు. భూమి కోల్పోయిన వారికి ఉద్యోగాలు, పరిశ్రమల్లో వాటా ఇలా చాలా హామీలు ఇచ్చారని, వాటిపై ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత లేదని తెలిపారు. శనివారం బొడ్డవరలో ఆయన నిర్వాసితులతో మాట్లాడారు. జిందాల్ యాజమాన్యం ఇచ్చిన స్క్రిప్టును ప్రారంభం నుంచి కలెక్టర్, మంత్రి శ్రీనివాస్, ఇప్పుడు హోం మంత్రి చెబుతున్నారని ఆయన ఆరోపించారు. భవిష్యత్‌లో పెడతామన్న కంపెనీల్లో ఏవిధంగా న్యాయం చేస్తారో అన్న విషయంపై వీరితో చర్చించకపోవడం బాధాకరమన్నారు. భూములిచ్చి దగా పడ్డవారిని విస్మరించడం తగదన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

భోగాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి సమీప జాతీయ రహదారి ఎత్తు బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ పి.సూర్యకుమారి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారిలో ఒక వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా.. అదే రహదారిలో వెళ్తున్న కారు బలంగా ఢీకుంది. గాయాలపాలైన ఆ వ్యక్తిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుని వివరాలు తెలిసినవారు భోగాపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

దేవుదళ సచివాలయంలో ఫర్నీచర్ ధ్వంసం

రేగిడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవుదళ గ్రామ సచివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హల్‌చల్ చేశారు. ఒక కంప్యూటర్‌ను, ఐదు ఇనుప కిటికీ మెస్‌లను ధ్వంసం చేశారు. వస్తువులను చెల్లాచెదురు చేశారు. కంప్యూటర్ వైర్లను కట్‌చేశారు. శనివారం ఉదయం సిబ్బంది యథావిధిగా సచివాలయం తెరిచేసరికి వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిఉన్నాయి. కంప్యూటర్ వైర్లు కట్ చేయడంలో సేవలు నిలిచిపోయాయి. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్‌ఐ గౌరినాయుడు సచివాలయాన్ని సందర్శించి, జరిగిన ఘటనపై ఆరా తీశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నీలావతి తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

భోగాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మహారాజపేట గ్రామంలో ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు అదే గ్రామానికి చెందిన కనకల సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.దుర్గాప్రసాద్ రావు శనివారం తెలిపారు. గ్రామంలోని తన ఇంటి ఆవరణలో ఈనెల 17న ఏపీ39 క్యూయూ7388 నెంబరు గల ద్విచక్రవాహనం ఉంచానని, మరుసటి రోజు ఉదయం చూసేసరికి కనిపించలేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు నిమిత్తం ఎస్‌ఐ పాపారావు కు అప్పగించామని సీఐ తెలిపారు.

బెల్లంఊట ధ్వంసం

వంగర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వీవీఆర్ పేటలో నాగావళి నది ఒడ్డున సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1500 లీటర్ల బెల్లంఊటను శనివారం ధ్వంసం చేశామని ఎస్‌ఐ షేక్‌శంకర్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసి, బెల్లంఊటను ధ్వంసం చేశామన్నారు.

అర్హులకు ఉచిత న్యాయ సహాయం

శృంగవరపుకోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, ఎస్.కోట న్యాయాధికారిణి బి.కనకలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.సతీష్ అధ్యక్షతన పొదుపు మహిళలతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల్లో జరుగుతున్న అన్యాయంపై మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రూ.3లక్షల వార్షిక ఆదాయం దాటని వారికి మాత్రమే ఈ వెసులుబాటు ఉందన్నారు. ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నవారు ఉభయ పార్టీల సమక్షంలో ఉచితంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సీనియర్ న్యాయవాది గేదెల ప్రకాష్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

డెంకాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి తెలిపారు. శనివారం చింతలవలస ఐదో పోలీసు బెటాలియన్‌లో 'జగమంతా వనం-ఆరోగ్యంతో మనం' నినాదంతో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న అదనపు కమాండెంట్ రాజారెడ్డి

ప్లాస్టిక్ రహితంగా విజయనగరం

(5వ పేజీ తరువాయి)



స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు

చెప్పారు. తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలను చైతన్యవంతం చేయడంలో కమిషనర్‌తో పాటు, శానిటేషన్ విభాగం కృషి ప్రశంసనీయమని కొనియాడారు.చెత్త నుంచి వచ్చిన పలు వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి, రోడ్డు నిర్మాణంలో కూడా ఉపయోగించవచ్చునని అన్నారు.జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ.. ప్రతి నెల మూడో శనివారం సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పలు కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 12 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, ఆర్డీవో దాట్ల కీర్తి, డీసీఎంఎస్ చైర్మన్ గంపా కృష్ణ, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, పోలీసులు, వివిధ ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలను పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

ఆదేశించారు. ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు లేని అద్దె భవనాలు ఉంటే వెంటనే మార్పు చేయాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ విమలరాణి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిందాల్ నిర్వాసితులు

జిందాల్ భూ నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూస్తామని కలెక్టర్ అంబేద్కర్ హామీ ఇచ్చారు. లోకసత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో చీడిపాలెం, ముషిడిపల్లి, చినఖండేపల్లి, కిల్తపాలం, మూలబొడ్డవర గ్రామాలకు చెందిన 10 మంది రైతులు శనివారం కలెక్టర్‌ను కలిశారు. తమ భూములకు సంబంధించి జిందాల్ యాజమాన్యం ఇప్పటి వరకు తమకు పరిహారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ మురళిని విచారణ అధికారిగా నియమించారు. విచారణ చేపట్టి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పెట్రోల్ బంకులపై పర్యవేక్షణేదీ?

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. జరిమానా రూపంలో రూ.2.33 లక్షలు వసూలు చేశారు. గత ఆరు నెలల కాలంలో 214 తనిఖీలు జరపగా..29 కేసులు నమోదు చేశారు. రూ.3.39 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

కానరాని సౌకర్యాలు..

పెట్రోల్, డీజిల్ కొట్టించుకునే వాహనదారుల కోసం బంకుల వద్ద కొన్ని సౌకర్యాలు ఉండాలి. కానీ, చాలాచోట్ల ఆ సదుపాయాలు లేవు. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించడంలేదు. మరుగుదొడ్లు ఉన్నా తాళాలు వేసి ఉంచుతున్నారు. కేవలం సిబ్బంది సొంత అవసరాలకే వాటిని వినియోగిస్తున్నారు. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత కొరవడితే ఏ అధికారికి ఫిర్యాదుచేయాలి? ఎవర్ని సంప్రదించాలి? అనేది వివరాలతో సహా పొందుపరచాలి. కానీ, కొద్ది బంకుల్లోనే వీటిని పొందుపరుస్తున్నారు. వాస్తవానికి తమ పరిధిలో ఉండే బంకులను తూనికలు కొలతల శాఖ అధికారులతోపాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది నిత్యం తనిఖీ చేయాలి. సంబంధిత ఆయిల్ కంపెనీ ప్రతినిధి సైతం సందర్శిస్తుండాలి. కానీ, జిల్లాలో అవెక్కడా అమలవుతున్న దాఖలాలులేవు. అందుకే బంకు యాజమాన్యాలు కల్తీతోపాటు ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు చేస్తున్నాం..

పెట్రోల్‌బంకుల్లో కల్తీ చేసినా, కొలతల్లో మోసానికి పాల్పడినా చర్యలు తప్పవు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న బంకులన్నీ పౌరసరఫరాలు, తూనికల, కొలతల శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. రెండు శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేస్తున్నారు. మాదృష్టికి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నాం. ఎక్కడైనా మోసాలు జరిగితే వెంటనే ఫిర్యాదుచేయవచ్చు. టోల్‌ఫ్రీ నంబర్లు సైతం అందుబాటులో ఉన్నాయి.

-రంగారెడ్డి, తూనికలు,కొలతలశాఖ అధికారి, ఉమ్మడి విజయనగరం

బొబ్బిలిలో రౌండ్‌టేబుల్ సమావేశం

బొబ్బిలి, జూలై19 (ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వం అదానితో చేసుకున్న ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలుచేస్తుండడం ఆశ్చర్యంగా ఉందని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. శనివారం బొబ్బిలి లోనిగంటి ప్రసాదం స్మారకభవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.శంకరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్య క్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లాఅధ్యక్షుడు మెరిగాని గోపాలం, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం, శివ, పీకేఎస్ నాయకుడు తమటాల అప్పలనాయుడు, మహిళాసంఘం నాయకురాలు పుణ్యవతి, రైతు సంఘం నాయకుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

పేదవారిని బంగారు కుటుంబంలో చేర్చాలి

బొబ్బిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబంలో అతి పేదవారిని చేర్చాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు తెలిపారు. స్థానిక పూల్‌బాగ్ సచివాలయంలో నిర్వహించిన పీ-4 పునః పరిశీలన వార్డు సభలో టీపీఆర్‌ఓ జగన్మోహనరావు, బీసపు చిన్నారావు, శివ పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

బాడంగి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్టంగా ఉండాలంటే కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. బాడంగిలో మండలస్థాయి వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బొబ్బిలి మునిసిపల్ మాజీ చైర్మన్ సావు కృష్ణమూర్తి, ఎంపీపీ బోగి గౌరి, వైస్ ఎంపీపీ రమేష్, యామల శివప్రసాద్ పాల్గొన్నారు.

డీడీవో కార్యాలయం కోసం భవనాల పరిశీలన

బొబ్బిలి రూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో డీడీవో కార్యాలయం ఏర్పాటుకు డీడీవో ఎం.కిరణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్ పలుప్రభుత్వభవనాలను పరిశీలించారు. జగన్నాథపురం గ్రామ సచివాలయం భవనం మొదటి అంతస్తులో కార్యాలయం ఏర్పాటుకు పరిశీలించి, ఎంపీడీవోకు పలు సూచనలుచేశారు. నూతన భవన నిర్మాణాలు పూర్తయేవరకు తాత్కాలికంగా అనువైనచోట కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు డీడీవో తెలిపారు. కాగా కృష్ణాపురంలో డీడీవో ఎం.కిరణ్‌కుమార్ చెత్త సేకరణ పద్ధతిని పరిశీలించారు.

తెంటువలసలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

బాడంగి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తెంటువలసలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసిఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో త్రినాథరావు, పాలవలస గౌరి, చిరంజీవిరావు, ఆవు సత్యనారాయణ,తెంటు రవిబాబు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై డీఆర్ఎంకు నివేదిక

●విజయనగరం ఎంపీ అప్పలనాయుడు



రైల్వే సమస్యలపై ఎంపీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

బొబ్బిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోగల పలు రైల్వే సంబంధిత సమస్యలపై డీఆర్ఎంకు నివేదిక అందజేస్తానని విజయనగరం ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో అప్పలనాయుడుతోపాటు ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడులు పరిశీలించారు.ఈస్టుకోస్ట్ డివిజన్ రైల్వే అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేసి బొబ్బిలి రాజ మహల్ గేటు రైల్వేరోడ్డు విస్తీర్ణం, మల్లమ్మపేటలో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న కాంపౌండ్‌వాల్, రైల్వే శ్రామికుల ఉపాధి, బొబ్బిలిలో వందేభారత్ రైలుహాల్ట్, బొబ్బిలిగూడ్స్ వ్యాగన్ లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్ సమస్య, డొంకినవలస ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంపై అధికారులతో అధ్యయనం చేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజరు రవివర్మ పాల్గొన్నారు.

●రామభద్రపురం, జూలై19 (ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు మండలం మానాపురం వద్ద కొత్తగా రైల్వే స్టేషన్ నిర్మాణం చేపట్టా లని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు కోరారు. శనివారం తెంటువలస గ్రామాన్ని సందర్శించిన ఎంపీని.. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈప్రాంతంలో ఎక్కువగా పేదలు ఉండటం, వలసలు ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. మానాపురంవద్ద రైల్వే స్టేషన్ నిర్మాణం చేస్తే ఈప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగం ఉంటుందన్నారు. ఇక్కడ కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణం చేపట్టడం వల్ల దత్తిరాజేరు, మెంటాడ, రామభద్రపురం, బాడంగి తదితర మండలాల ప్రయాణికులకు ఎంతో అనువుగా ఉంటుంద న్నారు. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, రామభద్రపురం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంట సాయికుమార్ పాల్గొన్నారు.

కాజ్‌వే కోసం పరిశీలన

బాడంగి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకినవలస రైల్వే స్టేషన్ వద్ద గోపీనాథ పట్నాయక్ చెరువు వాగును ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శనివారం పరిశీలించారు. ఇక్కడ కాజ్‌వే నిర్మించాలని ఎమ్మెల్యే బేబీనాయన,బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడులకు డొంకినవలస పిర్కా గ్రామస్థులు పలుపార్లు విన్నవించారు. దీంతో ఆ కాజ్‌వే రైల్వే స్థలంలో ఉండడంతో ప్రయాణానికి అవస్థలు పడుతున్నామని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.దీంతో ఆయన కాజ్‌వే వద్ద పరిశీలించారు. ఎంపీ అప్పలనాయుడు రైల్వే అధికారులకు ఫోన్‌చేసి అక్కడికి రప్పించారు. రైల్వే అధికారు లతో మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసమే ప్రభుత్వాలు ఉన్నాయని, అవసరమైతే రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని, ఇక్కడ కాజ్‌వే లేని ఎడల రైల్వే ఫైఓవర్ నిర్మించాలని కోరారు. . దీనిపై రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని రైల్వే అధికారులు ఎంపికి తెలిపారు.

ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ.. చెస్‌లో రాణిస్తున్న బొబ్బిలి బాలుడు

● 2006 ఇంటర్నేషనల్ రేటింగ్ అధిగమించిన లక్ష్మీచరణ్‌నాయుడు
●గ్రాండ్ మాస్టర్ టైటిల్‌కోసం సాధన

బొబ్బిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని సాహితీనగర్‌కు చెందిన గొర్లె లక్ష్మీచరణ్‌నాయుడు చెస్‌లో సత్తాచాటుతున్నాడు. ప్రత్యర్థుల ఎత్తులను చిత్తుచేస్తూ చిన్నతనంలో రాణించి పలువురి మన్ననలు పొందుతున్నాడు. ఇంటర్నేషనల్ రేటింగ్ 2006 సాధించాడు. గ్రాండ్ మాస్టర్ టైటిల్‌కోసం సాధన చేస్తున్నాడు. జాతీయస్థాయిలో 15, రాష్ట్రస్థాయిలో 20సార్లుపాల్గొని తన సత్తా నిరూపించుకున్నాడు. తండ్రి జగదీశ్వరరావు గాదెల వలస జడ్పీ హైస్కూల్‌లో, తల్లి విజయలక్ష్మి బొబ్బిలి గొల్లపల్లి మునిసిపల్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఆదివారం అంతర్జాతీయ చెస్ దినోత్సవంగా పురస్కరించుకుని బొబ్బిలికి చెందిన బాలుడు సాధించిన విజయాలపై ప్రత్యేక కథనం

●2009లో జన్మించిన చరణ్‌నాయుడు ఆరేళ్ల వయస్సులోనే చదరంగంలో అడుగుపెట్టాడు. 2015లో బొబ్బిలిలో జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి అండర్-7 పోటీలో మొదటిసారి పాల్గొని తన సత్తాచాటాడు. అదే ఏడాది పార్వతీపురంలో జరిగిన పోటీలో ప్రథమస్థానం పొందాడు.

●పూణే ఆల్ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో కూడా పాల్గొన్నాడు.ఎల్‌బీహెచ్‌ఎం ఇంటర్నేషనల్, జైపూరు ఓపెన్ టోర్నమెంట్‌లో పాల్గొని 2006 ఫైడ్‌రేటింగ్ సాధించాడు. జీఎం టైటిల్ (గ్రాండ్ మాస్టర్) కిరీటాన్ని అందుకోవాలన్న లక్ష్యంతో అకుంఠితదీక్షతో



డీఆర్ఎం కప్ పోటీలో ఆడుతున్న లక్ష్మీచరణ్‌నాయుడు (ఫైల్)

సాధన చేస్తున్నాడు. ఇందులో భాగంగా త్వరలో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నాడు. రష్యా తదితరదేశాల్లో ఆన్‌లైన్‌లో నిపుణుల నుంచి శిక్షణ పొందుతున్నాడు.

● 2024లో తమిళనాడులో దేశమొట్టమొదటి మహిళా చెస్ గ్రాండ్ మాస్టర్ విజయలక్ష్మి సుబ్రమ్‌తో ఆడి తన ప్రతిభా పాటవాన్ని నిరూపించుకున్నాడు.

● ఉదయ్‌పూర్ లేక్‌సిటీలో జరిగిన అండర్ -16 పోటీలో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు.ఏషియన్ యూత్ ఫెస్టివల్‌లో బెస్ట్ ఫెర్‌ఫార్మర్‌గా ప్రశంసలు అందుకున్నాడు.

●2016లోవిశాఖలో నేషనల్ చాంపియన్ షిప్, 2017లో అండర్-9లో డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్, 2018లో అండర్-11లో డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ సాధించాడు. భువనేశ్వర్‌లో జరిగిన కిట్ ఇంటర్నేషనల్ పోటీలో ఏడో స్థానాన్ని పొందాడు.

● ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న లక్ష్మీచరణ్‌నాయుడు చదువుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో చెస్ రంగంలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ పొందుతున్నాడు.

● విశాఖలో జరిగిన డీఆర్ఎం కప్ పోటీలో చరణ్ పావులు కదిపిన తీరు అందరి దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ తరహా ప్రతిభతో ఆయన ఇంటర్నేషనల్ రేటింగ్ 2006 గా ఉండడం గమనార్హం.



రామభద్రపురం: కొట్టక్కిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



బొబ్బిలి: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని అధికారులు కోరారు. శనివారం బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు.

●బొబ్బిలి రూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, వాటివల్ల వచ్చే నష్టాలపై ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీడీవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్, తహసీల్దార్ ఎం.శ్రీను, డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, అప్పారావు, సుధాకర్ పాల్గొన్నారు.

●బొబ్బిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలో చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనరు లాలం రామలక్ష్మి మొక్కలు నాటారు. అధికారులు, సచివాలయాల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములుకావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐదో వార్డు కౌన్సిలర్ వెలగాడ హైమావతి, డీఈఈ కోరెడ్ల కిరణ్‌కుమార్, ఆర్వో నాగరాజు, టౌన్ ప్రాజెక్టు అధికారి జగన్మోహనరావు, శానిటరీఇన్‌స్పెక్టరు మురళిపాల్గొ న్నారు. అలాగే బొబ్బిలి సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

● రామభద్రపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో రత్నం కోరారు. కొట్టక్కి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్‌వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులను దూరం చేసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మరడ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ఆకుల ప్రవీణ్‌కుమార్, అంగన్ వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పైసలిస్తేనే ఫైల్ కదిలేది

(5వ పేజీ తరువాయి)

నిరోధకశాఖ డీఎస్పీ పి.రామచంద్రరావు సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. ఓ లబ్ధిదారు బంధువురామకృష్ణ ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.

● నాలుగేళ్ల కిందట రాజాం ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావు రూ.80 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన టంకాలదిలీప్ అనే రైతు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కో ఏఈను ఆశ్రయిస్తే ఆయన రూ.1.20 లక్షలు డిమాండ్ చేశారు. రూ.80 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిపై దిలీప్ ఏసీబీని ఆశ్రయించడంతో ఏఈ అడ్డంగా బుక్కయ్యారు.●రెండేళ్ల కిందట రాజాం సబ్ ట్రెజరీ అధికారి గోవిందరాజులు ఏసీబీకి చిక్కారు. సంతకవిటి వ్యవసాయ విస్తరణాధికారి శ్యామల పెండింగ్ బిల్లుల కోసం ఎస్టీవో గోవిందరాజులును పలుమార్లు కలిశారు. బిల్లుల క్లియరెన్స్ కోసం ఆయన రూ.15 వేలు డిమాండ్ చేశారు. అడ్వాన్స్‌గా ఆమె రూ.5 వేలు ఇచ్చారు. అనంతరం ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారి సూచనల మేరకు శ్యామల మిగతా 10 వేలు ఎస్టీవోకు అందిస్తుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి దాడిచేసి పట్టుకున్నారు.

ఏసీబీని ఆశ్రయించండి

ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్ర యించండి.ఉద్యోగులు ఆదాయానికిమించి ఆస్తులు కలిగి ఉన్నారని మీ దృష్టికి వస్తే మాకు సమాచారం ఇవ్వండి. మీ పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచుతాం. అవినీతి అధికారులు, సిబ్బంది చర్యల్ని మాకు చెప్పేందుకు ప్రజలు ధైర్యంగా ముందుకు రావాలి.

-రమ్య, డీఎస్పీ, అవినీతి నిరోధకశాఖ

ఆశలు.. ఆవేదన

(5వ పేజీ తరువాయి)

జీవించేవారు. పరిశ్రమల కంటే వ్యవసాయం చేసుకోవాలని చూశారు. జిందాల్‌కు భూములను ఇచ్చేందుకు ఇష్టపడలేదు. అయితే, ఈ భూములన్ని అసైన్డ్, ప్రభుత్వ భూములుకావడంతో అప్పటి ప్రజాప్రతినిధులు,నాయకులు రైతులపై ఒత్తిడితెచ్చారు. అయినా వారు ససేమిరా అన్నారు. టీడీపీ, కమ్యూనిస్టు పార్టీలు రైతులకు అండగా నిలిచినప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జిందాల్‌కు భూములు ఇచ్చేందుకు మొగ్గుచూపింది. బలవంత భూసేకరణకు దిగడంతో రైతులు, ప్రతిపక్ష పార్టీలు తలవంచకతప్పలేదు. దీంతో కిల్తంపాలెం, ముషిడిపల్లి, పెదఖండేపల్లి, బొడ్డవర తదితర గ్రామాల్లో 834.66 ఎకరాల అసైన్డ్, 151.04 ఎకరాలప్రభుత్వ, 180.73 ఎకరాల జిరాయితీ భూములు మొత్తం 1166.43 ఎకరాలను జిందాల్ యాజమాన్యానికి అప్పగించింది. ఏపీఐఐసీ ద్వారా కాకుండా నేరుగా భూములను రిజిస్ట్రేషన్ చేశారు. ఫలితంగా భూసేకరణ సమయంలో అనేక అవకతవకలు జరిగాయి. అయితే, ఇది జరిగి 18 ఏళ్లు గడుస్తున్నా నేటికీ జిందాల్ యాజమాన్యం పరిష్కారం చూపలేదు. రైతులు రోడ్డెక్కిన ప్రతిసారీ అప్పటికప్పుడు ఏదోఒక హామీ ఇచ్చి మోసం చేసేది. అదే ఇప్పుడు ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఇప్పటికి కూడా జిందాల్ యాజమాన్యం అప్పట్లో జరిగిన ఒప్పందాల్లో వేటిని నెరవేర్చిందో, ఇంకా ఏమి పెండింగ్‌లో ఉన్నాయో అనేదానిపై స్పష్టత ఇవ్వడం లేదు.

జిందాల్ నిర్వాసితుల తరఫున ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పోరాటం చేస్తున్నారు. అప్పట్లో తన మాటకు విలువిచ్చి భూములు ఇచ్చినందున వారికి న్యాయం చేయాల్సి బాధ్యత తనపై ఉందని అంటున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జిందాల్ సమస్యను తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, రైతులు ఇచ్చిన భూముల్లో పరిశ్రమలు నిర్మించేందుకు జిందాల్ యాజమాన్యం ముందుకు వస్తుంటే అడ్డుకోవడం తగదని డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ వాదిస్తున్నారు. పరిశ్రమలు కావాలంటూ కొంతమంది నిర్వాసితులు, పలు గ్రామాల ప్రజలతో కలిసి రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్ తదితరులు ఆందోళనకు దిగుతున్నారు. టీడీపీ యువజన నాయకుడు ముక్కా రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గంలోని కొంత మంది నిరుద్యోగ యువత జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్‌లు వారిని అక్కడ నుంచి పంపించేశారు. ఇప్పటికే కలెక్టర్ బీఆర్ అంబే ద్కర్, ఎమ్మెల్యేలలితకుమారి నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం చూపుతామని చెబుతున్నారు. జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వంలో చర్చ లేనప్పుడు రైతులను ఎందుకు రెచ్చగొడుతున్నారో అర్థంకావడం లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అంటున్నారు.ఇలా జిందాల్ భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతుంది.

ప్రభుత్వం ఏం చేస్తుందో?

కూటమి ప్రభుత్వం పారిశ్రామికరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి ఎస్.కోట మండలంలో ఇప్పటికే ఉంది. అప్పట్లో భూసేకరణ ఎలా జరిగినా ఎక్కువ భూమి అందుబాటులో ఉండడంతో పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని ప్రభుత్వం భావిస్తుంది. పరిశ్రమలు వస్తే ఉపాధి దొరుకుతుందని నిరుద్యోగ యువత సంబరపడుతుంది. కంపెనీలు వస్తే తమ సమస్యలకు ఫుల్‌స్టాప్ పడినట్లేనని భూనిర్వాసితులు కలవరపడుతున్నారు. ఎవరికీ నష్టం జరగకుండా ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో వేచిచూడాలి.

టెక్నాలజీతో గంజాయికి అడ్డుకట్ట

(5వ పేజీ తరువాయి)

రిమాండ్‌కు తరలించాం. ఇందులో చాలామంది ఇతర ప్రాంతాలకు చెందినవారే. ఇంకా 1700 మంది అరెస్టు కావల్సి ఉంది. విజయనగరంతో పాటు ఇతర జిల్లాల్లో 29 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. 24 గంటలూ ఈ చెక్ పోస్టులు సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయి. ఇవికాక 300 వరకు డైనమిక్ చెక్ పోస్టులు ఎస్పీల ఆధ్వర్యంలో రోజువారి వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నాం. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం గంజాయి సాగు పూర్తి స్థాయిలో తగ్గు ముఖం పట్టింది. రైతులతో మాట్లాడి ఈ ఏడాది 10,500ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు రూపొందించాం. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, సాగు, రవాణా సమాచారాన్ని టోల్‌ఫ్రీనెంబర్ 1972కు అందించాలి. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.' అని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, బొబ్బిలి డీఎస్పీ జి. భవ్యారెడ్డి, సీఐ జీఏవీ రమణ, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, గజపతినగరం, పెదమానాపురం, బొండపల్లి, ఆండ్ర, బూర్జివలస ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో 20 కుటుంబాల చేరిక

బాడంగి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, పరిపాలనకు ఆకర్షితులై పలువురు టీడీపీని ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మంనాయుడులు తెలిపారు. మండలంలోని తెంటువలస గ్రామానికి చెదిన 20 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరాయి.ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు,టీడీపీ మండలాధ్యక్షులు తెంటురవిబాబు,మాజీ ఎంపీపీ బొంతుత్రినాథరావు, ఎంపీటీసీ సభ్యులు పాలవలస గౌరి, సర్పంచ్ తెంటు చిరంజీవిరావు, ఆవు సత్య నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.